కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ప్రభుత్వాస్పత్రులకు జబ్బు

- వెంటాడుతున్న సౌకర్యాల లేమి - అందని మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సామాన్యులకు ఉచితంగా వైద్య సేవలు అందించే ప్రభుత్వాస్పత్రులకు జబ్బు చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాల లేమి వెంటాడుతోంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సిహెచ్‌సిలు), రెండు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు ఉన్నాయి. హైరిస్క్ ప్రసవాలతో పాటు పుట్టిన వెంటనే చిన్నారులకు సమస్యలుంటే కర్నూలు సర్వజన వైద్యశాలలోని చిన్న పిల్లల విభాగానికి తీసుకొస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాక తెలంగాణ రాష్ట్రం, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం తదితర జిల్లాల నుంచి రెఫరల్ కేసులు ఎక్కువగా వస్తుంటాయి. కర్నూలు జిజిహెచ్‌లో మూడు ఎన్ఐసియు వార్డులు ఉండగా వాటిల్లో 60 పడకలున్నాయి. పుట్టిన వెంటనే ఏడవని పిల్లలు, బరువు తక్కువగా ఉండడం, ఇన్ఫెక్షన్, మూర్ఛ బారిన పడిన వారు, గుండె, ఊపిరితిత్తుల వంటి సమస్యలకు చికిత్స అందిస్తారు. అక్కడున్న పడకల కంటే చేరే వారి సంఖ్య అధికంగా ఉండడంతో ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ లేక రక్త పరీక్షలు నిర్వహించడం లేదు. ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ ఒక స్టాఫ్ నర్సు కొరతతో రాత్రి వేళల్లో అత్యవసర కాన్పు కేసులు వచ్చినప్పుడు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కూడా జరుగుతుండేవి. గత కొన్ని సంవత్సరాలుగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగడం లేదు. ఆపరేషన్లు చేయించుకునేందుకు పత్తికొండ, ఆదోని, కోడుమూరు వంటి ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదోని పట్టణంలో మాత శిశుఆస్పత్రిలో పది పడకలతో నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని

గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఏర్పాటు చేశారు. పడకలు సరిపోకపోవడంతో ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. పత్తికొండ సిహెచ్‌సిలో నవజాత శిశువు సంరక్షణ కేంద్రం లేకపోవడంతో ఆదోని, కర్నూలు వెళ్తున్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలోని నవజాత శిశుకేంద్రంలో ఆధునిక యంత్రాలున్నా స్థలం చాలకపోవడంతో వాటిని వినియోగించకుండా మూలన పడేశారు. కోసిగి ప్రభుత్వాస్పత్రిలో ప్రతినెలా 120 నుంచి 150 ప్రసవాలు జరుగుతున్నాయి. శిశు సంరక్షణ కేంద్రం లేకపోవడంతో పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. డోన్ సిహెచ్‌సిలో నవజాత సంరక్షణ కేంద్రం ఉన్నా సరైన సౌకర్యాలు లేకపోవడంతో కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. గత ప్రభుత్వం గోనెగండ్ల యుపిహెచ్‌సి స్థాయిని తగ్గించి పిహెచ్‌సిగా మార్చింది. 30 పడకల ఆస్పత్రి ఆరు పడకల ఆస్పత్రిగా మారింది. దాంతో గతంలో 8 మంది వైద్యులు ఉండగా ఆ సంఖ్య ఇద్దరికి తగ్గిపోయింది. గతంలో 10 మంది నర్సులు సిబ్బంది ఉండగా ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారు. గతంలో 300 మంది రోజుకు ఒపి చూపించుకుంటుండగా ప్రస్తుతం 100 నుంచి 150 మంది రోగులకు మాత్రమే ఒపి చూస్తున్నారు. గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే వారు. ఇప్పుడు చేయకపోవడంతో ఎమ్మిగనూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఆదోని మండలం పెద్దహరివాణం, పెద్దతుంబలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలు నిర్వహించేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు శ్రద్ధ పెట్టకపోవడం వల్లే మెరుగైన వైద్యం అందడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రయివేట్‌లో దోచేస్తున్నారు...

పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల నుంచి కర్నూలుకు రెఫర్ చేసిన కేసుల్లో ఎక్కువగా ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. అక్కడికెళ్లిన తర్వాత ఆరోగ్యశ్రీ పేరుతో దగా చేస్తున్నారు. ఆస్పత్రిలో చేర్చుకున్న తర్వాత కొన్ని పరీక్షలకు ఆరోగ్యశ్రీ వర్తించదంటూ పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువుకు పచ్చ కామెర్లు ఉన్నట్లు నిర్ధారణ అయితే ఫొటోథెరపీ ద్వారా చికిత్స అందించాల్సి ఉంది. అందుకు ప్రయివేట్‌లో రోజుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇతర రోగాలకు ఆస్పత్రిలో అడ్మిట్ చేస్తే రోజుకు రూ.10 వేల నుంచి రూ.30 వరకూ వసూలు చేస్తున్నారు. దీంతో సామాన్యుల జేబు ఖాళీ అవ్వక తప్పడం లేదు.

ఆస్పత్రి స్థాయిని పెంచాలి

- కోతిరాళ్ల వీరన్న, గోనెగండ్ల

గోనెగండ్ల వైద్యశాల స్థాయిని తగ్గిస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన జిఒపై ప్రస్తుత ప్రభుత్వం పునరాలోచించి వైద్యశాల స్థాయిని 30 పడకల వైద్యశాలగా పెంచాలి. పూర్తిస్థాయిలో డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించాలి. గతంలో మాదిరిగా అన్ని రకాల వైద్య సేవలను అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

జోహరాపురం నుంచి వెంకాయపల్లెకు రోడ్డు వేయాలి

- కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగర మేయర్ తన సొంత వార్డులోనే జోహరాపురం నుండి వెంకాయపల్లి వరకు రోడ్డు కూడా వేయించుకోలేని స్థితిలో ఉన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌసుదేశాయ్ విమర్శించారు. సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మహమూద్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. డి.గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు విజయ రామాంజనేయులు మాట్లాడారు. జోహరాపురం నుండి వెంకాయపల్లె వరకు రోడ్డులో వాహనాలు, బాటసారులు నడవలేని పరిస్థితి ఉందన్నారు. ఈ విషయాన్ని గత ఆరు సంవత్సరాల నుండి గత ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ,నగర కార్పొరేషన్ ప్రథమ పౌరుడు మేయర్ బివై.రామయ్య వార్డు కావడం వలన, ఆయన దృష్టికి కూడా అనేకసార్లు తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ దారిలో ఇందిరమ్మ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, అనేక కాలనీలకు వెళ్లే మార్గమని పేర్కొన్నారు. ఈ రోడ్డులో ప్రయాణిస్తున్న చాలామంది వాహనదారులు, బాటసారులు ప్రమాదాలు జరిగి కాళ్లు, చేతులు విరుగ్గొట్టుకుని హాస్పిటళ్ల పాలై ఆర్థికంగా నష్టపోయారన్నారు. ఇంత ప్రాధాన్యత కలిగిన రోడ్డును మున్సిపల్ అధికారులు అయితేనేమి, ఆర్అండ్‌బి వారు ఒకరిపై ఒకరు నెడుతూ కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పేరుమీద బటన్ నొక్కుతున్నామని ప్రచారం చేసుకుంటూ రోడ్లు నిర్మించకుండా అభివృద్ధి చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. అందుకే వారు ప్రతిపక్షంలో కూర్చోవలసి వచ్చిందని విమర్శించారు. లేకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్‌కు ఈ సమస్యపై వినతిపత్రం అందజేయగా ఆర్ఎంబి అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కుమార్, నాగరాజు, విశ్వనాథం, మద్దయ్య, షేక్షా, షఫీ, ఇందిరమ్మ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తప్పవు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

- ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను పరిష్కరించకపోతే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి ఆన్‌లైన్ ద్వారా వచ్చిన వినతులను గంటకోసారి ఓపెన్ చేసి చూసి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని శాఖల అధికారులకు వచ్చిన వినతులను ఓపెన్ చేసి చూడడం కూడా చేయలేదన్నారు. గడువులోపు వినతులను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.మధుసూదన్ రావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగ్ నిర్వహించాలి

జిల్లాలలో హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హర్ ఘర్ తీరంగ్ కార్యక్రమం లో భాగంగా తిరంగ్ కాన్వాస్ మీద జిల్లా కలెక్టరు , ఇతర జిల్లా అధికారులు సంతకాలు చేశారు. జిల్లాలో ఈనెల 9 నుండి 15 వరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో జిల్లా అధికారులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అన్ని జిల్లాలలోని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని విద్యాసంస్థల్లో హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరు వారి ఇంటి పైన మూడు రంగుల జెండాను ఎగర వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి విజయ, సెట్కూర్ సిఇఒ రమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

వేతన వెతలు

- ఆరు నెలలుగా అందని వేతనాలు

- జిల్లాలో1729 మంది ఆయాలు, 248 మంది నైట్ వాచ్మెన్లు

- రూ.4 కోట్లకు పైగా వేతన బకాయిలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్మెన్‌లకు ఆరు నెలలుగా జీతాలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. తక్కువ వేతనాలు అయినప్పటికీ పనిచేస్తున్న వారికి సకాలంలో వేతనాలు ఇవ్వడంలో విద్యాశాఖ విఫలమవుతుంది. అప్పులు చేసుకొని కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు ఇతర విద్యాలయాల్లో దాదాపుగా1729 మంది స్కూల్ ఆయాలు, 248 మంది నైట్ వాచ్మెన్లు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హాయంలో నియమితులైన వారికి ప్రతినెలరు రూ.6000 చొప్పున వేతనం చెల్లించేవారు. ప్రతి పాఠశాలలో 300 మంది విద్యార్థులకు ఒక ఆయా, 600 మందికి ఇద్దరు, 800 మందికి ముగ్గురు, 900 మందికి విద్యార్థులు పైగా ఉంటే నలుగురు చొప్పున స్కావెంజర్లను నియమించారు.

ఫిబ్రవరి వరకు వేతనాలు చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ఆరు నెలలుగా వేతనాలు విడుదల కాలేదు. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం కింద రూ.15000 మంజూరు చేసేది. అమ్మ ఒడి నుండి రూ.1000 ప్రభుత్వం పాఠశాలలో పారిశుధ్య పర్యవేక్షణకు తీసుకునేది. ఇప్పటివరకు దాదాపుగా జిల్లాలో పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్మెన్ల వేతనాలకు సంబంధించి రూ.4 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. మరొక పక్క కొత్తగా ఏర్పాటయిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, నైట్ వాచ్మెన్ తొలగింపుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటయిన పాఠశాల యాజమాన్య కమిటీల ద్వారా తీర్మానాలు చేయించి అధికార పార్టీకి చెందిన వారిని నియమించుకునేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఒకపక్క వేతనాలు అందక, మరొక పక్క రాజకీయ వేధింపులు పెరగడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే శానిటేషన్ వర్కర్స్ నైట్ వాచ్మెన్ల జీతాలను చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జె. నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న కార్మికుల శిబిరం వద్దకు పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్‌పాల్, సూపరిండెండెంట్ రాజశేఖర్ అక్కడికి చేరుకొని యూనియన్ ప్రతినిధుల నుండి వినతిపత్రం స్వీకరించారు. గుర్తింపు కార్డులు ఇస్తామని, జాబ్ చార్ట్‌తో పాటు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని యూనియన్ నాయకులు కోరారు. రాజకీయ వేధింపులను కూడా అరికట్టాలని విన్నవించారు. ఈ సమస్యను రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎడి హామీ ఇచ్చారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఆయాలు, నాయకులు

వేతనాలను వెంటనే విడుదల చేయాలి

- జె.నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు, పాఠశాల ఆయాల యూనియన్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే స్కావెంజర్లు నైట్ వాచ్మెన్ల బకాయి వేతనాలను విడుదల చేయాలి. అలాగే వీరికి జాబ్ చార్ట్ తయారుచేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. వారిపై రాజకీయ వేధింపులు అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలి. కనీస వేతనం అమలు చేసేందుకు ప్రభుత్వం పూనుకోవాలి.

కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా వేతనాలు విడుదల

- సామ్యూల్ పాల్, అసిస్టెంట్ డైరెక్టర్, విద్యాశాఖ

పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ నైట్ వాచ్ మెన్ జీతాల చెల్లింపునకు సంబంధించి విద్యాశాఖ కొత్త సాఫ్ట్‌వేర్ రూపొందిస్తుంది. కొత్త సాఫ్ట్‌వేర్ రూపొందించిన అనంతరం వెంటనే వేతనాలు నెలనెలా సక్రమంగా విడుదలవుతాయి. పెండింగ్ వేతనాలు కూడా త్వరలోనే విడుదల కానున్నాయి.

వేతనాలు ఇవ్వకపోతే పని ఎలా చేయాలి

- శారద, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పెద్ద మార్కెట్ కర్నూల్

ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే పని ఎలా చేయాలి. గతంలో కంటే ఇప్పుడు పని భారం పెరిగింది. ఉదయం ఎనిమిది గంటలకు వెళ్తే సాయంత్రం ఆరున్నర గంటలకు ఇంటికి రావాల్సి ఉంది. ఉద్యోగ భద్రత కల్పించడమే కాకుండా కనీస వేతనం చెల్లించాలి.

అప్పులు చేసుకొని కుటుంబాల పోషణ

- సుమలత ఉర్దూ పాఠశాల కర్నూల్

పాఠశాలలో ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేసిన నెల నెలా వేతనం రాకపోతే కుటుంబాల పోషణ చేయడం కష్టతరమైంది. వేతనాలు వస్తాయనే ధీమాతో అప్పులు చేసుకుని కుటుంబాలను పోషిస్తున్నాం. ఇప్పటికైనా వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

పురుగు మందుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలంలో వ్యవసాయాధికారి రవి ప్రకాష్ సోమవారం పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ వెంకటేశ్వర , బాబాసీడ్స్ దుకాణాలను పరిశీలించి, ఐదు రకాల విత్తన నమూనాలను సేకరించి వాటిని నాణ్యత ప్రమాణాలను పరీక్షించుటకు రీజనల్ కోడింగ్ సెంటర్ తిరుపతికి పంపారు. మండలంలోని రైతులు ఎరువులు , పురుగు మందుల స్ప్రే చేయుట కొరకు రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. రైతు సేవ కేంద్రం ద్వారా ఈ -పంట నమోదు కార్యక్రమం జరుగుతున్నదని, మండలంలోని రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు.

రవీంద్రలో ఓరియంటేషన్ డే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగరంలోని రవీంద్ర , జి. పులయ్య ఇంజనీరింగ్ కళాశాలలు సంయుక్తంగా ఓరియంటేషన్ డే ను సోమవారం నిర్వహించారు. కళాశాల చైర్మన్ జివిఎం.మోహన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల గౌరవ సలహాదారు డాక్టర్ ఇఎస్.చక్రవర్తి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కొత్తగా బిటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు ప్రోగ్రామింగ్ స్కిల్స్ పెంపొందించుకోగలిగితే ఉద్యోగాలు వాటంతట అవే మీ వద్దకు చేరుతాయని అన్నారు. ఏ బ్రాంచి చదువుతున్నా మన్నది ముఖ్యం కాదని, ఏ బ్రాంచ్ వారైనా ప్రోగ్రామ్స్‌ల్లో నైపుణ్యం సాధించ గలిగితే వారికి కోకొల్లలుగా అవకాశాలు వస్తాయని తెలిపారు. ఆధునిక టెక్నాలజీ అయిన ఎఐ, ఎంఎల్, డేటాసైన్స్, డ్రోన్ టెక్నాలజీపై పట్టు సాధించా లని అదేవిధంగా భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ కెఇ. శ్రీనివాస మూర్తి , డాక్టర్ శ్రీనివాస రావు, మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు , తల్లిదండ్రులకు కళాశాలల నియామవళిని తెలిపారు.కళాశాలల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కర్ణాటక ఎమ్మెల్యేను కలిసిన కురువ సంఘంనాయకులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్ణాటక రాష్ట్రం హావేరి జిల్లా బ్యాడిగె ఎమ్మెల్యే కురువ శివన్నను కురువ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామి, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ మొలగవల్లి శశికళ, కృష్ణ మోహన్, సి. బెళగల్ మండల కురువ సంఘం అధ్యక్షులు కురువ నాగరాజు ఉన్నారు.

చెన్నమ్మ సెంటర్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి

ఎమ్మెల్యే గౌరు చరితకు డివైఎఫ్ఐ, ఐద్వా వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు చెన్నమ్మ సర్కిల్ వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించి సర్కిల్ ఏర్పాటు చేసి ముజాఫర్ నగర్ వరకు రోడ్డు డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితను కలిసి డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్. అలివేలు, డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్‌బాష మాట్లాడుతూ చెన్నమ్మ సెంటర్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందని, ఇక్కడ ఎటువంటి సర్కిల్ లేకపోవడం వలన చాలా సందర్భాలలో వాహనాలు స్తంభించిపోయి ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. చెన్నమ్మ సెంటర్ నుండి ముజాఫర్ నగర్ వరకు రోడ్డు గుంతలు గుంతలుగా చీలిపోయి అస్తవ్యస్తంగా ఉందని, ఈ మార్గంలో ఎటువంటి డివైడర్ లేకపోవడం వల్ల వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాత్రి వేళలో ఈ మార్గం చాలా ప్రమాదకరంగా ఉందని, సెంట్రల్ లైటింగ్ లేకపోవడం వల్ల వాహనాలు ప్రజలు ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గరకు వచ్చేసరికి చీకట్లో ఎదురెదురుగా వచ్చి కనిపించకుండా ఢీ కొట్టుకొని ప్రమాదాలకు జరుగుతున్నాయన్నారు. కర్నూలు కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి ట్రాఫిక్ నియంత్రణ కోసం చెన్నమ్మ సెంటర్లో సర్కిల్ ఏర్పాటు చేసి, సెంటర్ నుండి ముజాఫర్ నగర్ వరకు కొత్తగా రోడ్డు వేసి, డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ వేయాలని ఎమ్మెల్యే గౌరు చరితను కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ, జిల్లా నాయకురాలు ధనలక్ష్మి, డివైఎఫ్ఐ నగర నాయకులు సాయి, విక్రమ్, సికిందర్, మల్లేష్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలి

క్లాప్ డ్రైవర్లకు 7 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలి

కమిషనర్‌కు పిపిఎస్ఎస్ బృందం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో అస్తవ్యస్తంగా మారిన రోడ్లను మరమ్మతు చేయాలని, చెత్తసేకరించే క్లాప్ డ్రైవర్లకు ఏడు నెలల పెండింగు వేతనాలు వెంలనే ఇవ్వాని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్‌కు వినతిత్రం ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన బృందంలో ఇరిగినేని పుల్లారెడ్డి, కె. శ్రీనివాసులు, సివి.వర్మ, ఎస్.రమణగౌడు, ఎన్.శ్రీనివాసరెడ్డి, బి.రాజు, రామాంజి ఉన్నారు. వారు మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండ్ నుండి యుకాన్ ప్లాజా, ఎపిఎస్‌పి క్యాంపు మీద రామలింగేశ్వరనగర్ మంత్రి టిజి.భరత్ కార్యాలయం వరకు ఎగుడుదిగుడుగా ఉన్న రోడ్డును మరమ్మతులు చేయాలన్నారు. పోయిన చెత్తను తొలగించాలని కోరారు. పున్నమి గెస్టహౌస్ రోడ్డు, బళ్లారి చౌరస్తా నుండి ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా రాజీవ్‌నగర్ వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం దాదాపు రూ.కోటి 50 లక్షలు వరకు మంజూరయ్యాయని అన్నారు. పాత బస్టాండు, అర్బన్ బ్యాంకు, పాత చాంద్ టాకీస్ సమీపంలో కల్వర్టుల గుంతలపై (మ్యాన్‌హోల్స్) ఇనుప మూతలు శిథిలం అవడంతో ద్విచక్ర వాహనదారులు రోజు ప్రమాదాల గురవుతున్నారని తెలిపారు. సీతారామ నగర్ నుండి బస్టాండ్‌కు వచ్చే రోడ్డు పై చెత్త పేరు కొనిపోయి దుర్వాసన వస్తుందన్నారు. చెత్త సేకరించే దాదాపు 100 వందమందికి ఏడు నెలల నుండి జీతాలు రాక వస్తువులతో అలుమటిస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ...ఆఫీసులకే పరిమితమైన వారిపై చర్య తీసుకోవాలని కోరారు. కమిషనర్ రామలింగేశ్వర్ స్పందిస్తూ రోడ్ల మరమ్మతులు చేస్తామని, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని ఇంజనీర్‌కు హెల్త్ ఆఫీసర్‌కు ఆదేశాలు ఇచ్చారు. క్లాప్ డ్రైవర్లకు వెంటనే జీతాలు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు ఇ.పుల్లారెడ్డి

ఫిర్యాదు దారుని సమస్యలు వింటున్న ఎస్పి బిందుమాధవ్

విచారించి న్యాయం చేస్తాం : ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు కొత్తపేటలోని కర్నూలు ఎస్పి క్యాంపు కార్యాలయంలో ఎస్పి జి.బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఎస్పి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం మొత్తం 115 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పి హామీ ఇచ్చారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు శివశంకర్, హాజీవలి పాల్గొన్నారు.

నైట్ డ్యూటీల నుండి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విఆర్ఎలకు మండల కార్యాలయాల్లో నైట్ డ్యూటీలు వేయడాన్ని మానుకోవాలని, డ్యూటీల నుండి విఆర్ఎలకు మినహాయింపు ఇవ్వాలని విఆర్ఎల సంఘం జిల్లా నాయకులు కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి ధనుంజయ్, తదితరులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ విషయమై రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే అనేక రూపాలలో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో విఆర్ఎల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టడానికి సిద్ధమవుతామని తెలిపారు.

దోమకాటు వల్లే ప్రాణాంతక వ్యాధులు

- కమిషనర్ రామచంద్రరెడ్డి

పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

దోమ కాటు వల్లే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతున్నాయని, జాగ్రత్తలు వహించాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. సోమవారం ఆదోని పట్టణం 19వ వార్డు ఆర్‌టిసి, కాపర్తి నగర్‌లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడం వల్ల దోమ గుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయని తెలిపారు. నీటి తొట్టెలు, డ్రమ్ములు, సింటెక్స్, పూల కుండీలను తరచూ శుభ్రం చేయిస్తూ ఉండాలని సూచించారు. మురుగు కాలువలు, చాలా కాలం నిలిచిన నీటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, క్లోరినేషన్ చేయాలని తెలిపారు. కాచి వడబోసిన నీటిని తాగేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి జ్వరాలు సోకినట్లు నిర్ధారణ కాగానే చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, హెల్త్ సెక్రటరీ పద్మ, మేస్త్రి మహబూబ్ బాషా ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల అభివృద్ధిపై పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే పార్థసారథి, ఎంపిపి దానమ్మ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు మండల స్థాయి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ గీతావాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పార్థసారథి హాజరయి మాట్లాడారు. మండల అధికారులు, సర్పంచులు సమన్వయంతో గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. డిఎల్‌పిఒ నూర్జహాన్, ఇఒఆర్‌డి నాగరాజు పాల్గొన్నారు.

'పాఠశాల అభివృద్ధికి కృషి'

ప్రజాశక్తి - గోనెగండ్ల

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న షేక్ గౌస్

పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పాఠశాల అభివృద్ధికి ప్రిన్సిపల్ షాహినా పర్వీన్‌తో కలిసి కృషి చేస్తానని ఎపి మోడల్ పాఠశాల కమిటీ ఛైర్మన్ షేక్ గౌస్ తెలిపారు. సోమవారం మొదటి సారిగా ఆయన కమిటీ సభ్యులతో కలిసి ఎపి మోడల్ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు మధ్యాహ్న భోజనం నాణ్యతపై పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్‌తో సమావేశమై చర్చించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతలో రాజీ పడకుండా భోజనాన్ని అందించాలని వంట ఏజెన్సీకి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించేలా చూడడంతో పాటు పాఠశాల అభివృద్ధికి కమిటీ సభ్యులు పాఠశాల సిబ్బందితో కలిసి కృషి చేస్తానని తెలిపారు. గాజులదిన్నె చంద్ర, గానిగ బాష, అక్బర్, జయన్న పాల్గొన్నారు.

పంచాయతీలకు ఇద్దరూ కీలకమే

- ఎంపిపి జూటూరు హేమలత, డిపిఆర్‌సి ఉమా మహేశ్వరి

ప్రజాశక్తి - చిప్పగిరి

మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత

పంచాయతీ అభివృద్ధిలో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి ఇద్దరూ కీలకంగా ఉంటారని ఎంపిపి జూటూరు హేమలత, డిపిఆర్‌సి ఉమామహేశ్వరి, ఎంపిడిఒ సివి.కొండయ్య తెలిపారు. సోమవారం మండల కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలతో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ తరగతులకు సర్పంచులు తప్పనిసరిగా పాల్గొని గ్రామాభివృద్ధిలో చురుకైన పాత్ర వహించాలని చెప్పారు. సర్పంచి, పంచాయతీ కార్యదర్శి ఇద్దరూ సమన్వయంతో ముందుకెళితే గ్రామాభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు. పరిపాలనాధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములు, ఎపిఒ మాధవ శంకర్ పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు

- భక్తులకు అరకొర సౌకర్యాలు - ఆగని నిలువు దోపిడీ

ప్రజాశక్తి - కౌతాళం

ఎల్‌ఎల్‌సిలో స్నానాలు చేస్తున్న భక్తులు

శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండో సోమవారం ఉరుకుంద పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సాయంత్రానికే వేల సంఖ్యలో భక్తులు ఉరుకుందకు చేరుకున్నారు. కౌతాళం, ఆదోని, కోసిగి, హాల్వి రహదారులు భక్తులతో కిటకిటలాడాయి. ఇసుక వేస్తే రాలనంత భక్తజనం ఇప్పుడు క్షేత్రానికి తరలి రావడంతో పుణ్యక్షేత్రానికి నలువైపులా సుమారు రెండు కిలోమీటర్ల వరకు భక్తులు వ్యాపించారు. ఈరన్న స్వామి నామస్మరణంతో పుణ్యక్షేత్రం మార్మోగింది. తుంగభద్ర దిగువ కాలువలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారికి ఇష్టమైన నైవేద్యాన్ని తడి గుడ్డలతోనే పిండి వంటలు చేశారు. స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులను దృష్టిలో పెట్టుకుని డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ అర్ధరాత్రి నుంచి భక్తుల దర్శనానికి అవకాశం కల్పించారు.

భక్తులకు వెంటాడిన నీటి సమస్య

ప్రసిద్ధిగాంచిన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో నీటి సమస్యతో భక్తులు విలవిల్లాడారు. తాగడానికి, భక్తులు స్వామి వారికి వంటలు వండడానికి దేవాలయం వారు ఏర్పాటు చేసిన నీటి సౌకర్యం ఏ మాత్రమూ సరిపోలేదు. మురుగుదొడ్ల వద్ద నీరు లేక భక్తులు పడిన ఇబ్బందులు అన్ని ఇన్ని కావు. దేవాలయానికి భక్తుల ద్వారా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా, భక్తులకు మాత్రం కనీసం నీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.

లోపించిన పారిశుధ్యం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాల్లో పారిశుధ్యం లోపించింది. పుణ్యక్షేత్రంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం, మురుగునీరు నిల్వ ఉండడంతో భక్తులు కొన్ని ప్రాంతాల్లో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా మురుగుదొడ్ల వద్ద నీటి సౌకర్యం లేకపోవడంతో కొంతమంది భక్తులు మల విసర్జన అక్కడే చేయడంతో దుర్గంధం వెదజల్లింది. ఈ ఉత్సవాల్లో పారిశుధ్య పనుల కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈరన్న స్వామి భక్తులు కోరుతున్నారు.

నిలువు దోపిడీని అరికట్టండి

శ్రావణమాస ఉత్సవాల ముందు నుంచే ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఉత్సవాల ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చిస్తున్నారు. సౌకర్యాల పట్ల ఆదేశిస్తున్నారు. అధిక ధరలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇప్పుడు క్షేత్రంలో భక్తులు నిలువు దోపిడీకి గురవుతూనే ఉన్నారు. ఈ ఉత్సవాలకు ఈరన్న స్వామి భక్తుడు పుణ్యక్షేత్రంలో అడుగు పెట్టినప్పటి నుంచి తిరుగు ప్రయాణం వరకు నిలువు దోపిడీకి గురవుతూనే ఉన్నాడు. పుణ్యక్షేత్రంలో ప్రతిచోటా ధరలు పెంచడంతో భక్తుడు దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా తాగునీరు, సెల్‌ఫోన్, లగేజ్ నుంచి స్వామి వారికి సమర్పించే టెంకాయల వరకు అధికంగా వసూలు చేస్తున్నారు.

గుండుకు రూ.100 కొట్టాల్సిందే..!

శ్రావణమాస ఉత్సవాల్లో భక్తులు మొక్కుబడి కింద తలనీలాలు సమర్పించే ఆనవాయితీ కొనసాగుతూనే ఉంది. ప్రతి వారంలోనూ వేల సంఖ్యలో భక్తులు సమర్పిస్తారు. ఇదే అదునుగా భావించిన కల్యాణ కట్టలోని వ్యక్తులు ప్రతి గుండుకూ రూ.100 వసూలు చేస్తున్నారు. తలనీలాలు సమర్పించే భక్తుడు దేవాలయం కౌంటర్‌లో రూ.40 చెల్లించి టికెట్టు తీసుకుంటాడు. ఈ టికెట్ల ఆధారంగా గుండు కొట్టే వారికి దేవస్థానం నుంచి కొంత మొత్తాన్ని చెల్లిస్తారు. అయినా భక్తుల నుంచి ముక్కు పిండి రూ.100 వసూలు చేస్తున్నారు. చాలామంది భక్తులు పేదవారు వస్తుంటారు. ఇలాంటి వారు డబ్బులు అధికంగా చెల్లించడంలో మనోవేదనకు గురికాక తప్పడం లేదు. దేవాలయ అధికారులు ఎంత హెచ్చరిస్తున్నా నిలువు దోపిడీ మాత్రం జరుగుతూనే ఉంది. సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ దీనిపై దృష్టి సారించి సరైన చర్యలు తీసుకొని భక్తులకు మేలు చేయాలని కోరుతున్నారు.

నవోదయలో స్కిప్పింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

జవహర్ నవోదయ విద్యాలయంలో 12 నుంచి 14 వరకు జరిగే ప్రాంతీయ స్థాయి స్కిప్పింగ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ క్యాంపు (బాలబాలికల) కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని 22 నవోదయ విద్యాలయాల నుంచి 141 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడురోజుల పాటు నిర్వహించే ఈ పోటీలకు ముఖ్య అతిథిగా సిఐ మోహన్ రెడ్డి హాజరయి జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రీడల ప్రాముఖ్యతను వివరిస్తూ.. విద్యార్థులందరూ దేశానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని సిఐ ఆకాంక్షించారు. విద్యాలయ ప్రిన్సిపల్ ఇ.పద్మావతి మాట్లాడుతూ... ఈ పోటీలను అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలుగా విభజించారని తెలిపారు. మొదట వేగం (30 సెకన్లు), రెండోది డబుల్ అండర్ (30 సెకన్లు), మూడోది ఎండ్యూరెన్స్ (3 నిమిషాలు) ఉంటుందని చెప్పారు. ఇక్కడ మొత్తం 30 మందిని జాతీయ స్థాయికి (కేటగిరీలో 10 మందిని) ఎంపిక చేస్తారని తెలిపారు. ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ టెక్నికల్ అధికారులు న్యాయ నిర్ణేతలుగా సాగర్, నిరంజన్, చంద్రశేఖర్ వ్యవహరించారని చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న, వైస్ ప్రిన్సిపల్ కె.చందిరన్, ఎకె.బసవరాజ్, ఎర్రిస్వామి, శ్రీలక్ష్మి, జగన్నాథ్, శిరీష, శ్రీనివాసరావు, వెంకటేష్, అంజలి, నబీ పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సిఐ మోహన్ రెడ్డి

25 మంది టిడిపి నాయకులు అరెస్టు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు కూరగాయల మార్కెట్‌లో ఈనెల 2న వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో 25 మందిని అరెస్టు చేసినట్లు సిఐ మస్తాన్ వలీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. టిడిపికి చెందిన ఈడిగ వీరేంద్ర, ఈడిగ మాస్ వీరేష్, ఈడిగ వీరాంజనేయులు, ఈడిగ వీరేష్, ఈడిగ నాగరాజు, గొల్ల మురళీ, శేఖర్, రమేష్‌తో పాటు మరో 17 మందిని అరెస్టు చేశామని తెలిపారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వుల మేరకు 25 మందిని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

ఎంపిడిఒ రాణెమ్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి ఎంపిడిఒ రాణెమ్మ

ఆస్పరి ఎంపిడిఒగా రాణెమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలానికి ఎంపిడిఒగా వెళ్లానని తెలిపారు. ఇక్కడ ఎంపిడిఒ విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ నారాయణ అనంతపురం జిల్లా యాడికి మండలానికి బదిలీపై శుక్రవారం వెళ్లడంతో తిరిగి ఆస్పరి ఎంపిడిఒగా వచ్చినట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి పెట్టి, దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఎప్పటికప్పుడు డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేయాలని తెలిపారు. రోడ్లపై మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. **చిప్పగిరి** ఎంపిడిఒగా సివి.కొండయ్య మండల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లాకు వెళ్లారు. ప్రభుత్వం పూర్వపు స్థానంలో కొనసాగేలా జిఒ తెచ్చిన నేపథ్యంలో ఇక్కడకు వచ్చినట్లు ఎంపిడిఒ తెలిపారు. సివి.కొండయ్యకు ఇఒఆర్‌డి బాలన్న, పరిపాలన అధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములు, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

చిప్పగిరి : కొండయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

భూఆక్రమణకు యత్నించిన వారిపై కేసు నమోదు : సిఐ

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పొట్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో కె.సరోజమ్మకు చెందిన భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించి దౌర్జన్యానికి పాల్పడిన నూర్జహాన్, ఆమె ముగ్గురు కుమారులు అమ్రిన్ బాష, బాబావలీ, పర్వీన్‌పై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. 1989 ల్యాండ్ సీలింగ్ ప్రకారం 310/1ఎలో 85 సెంట్ల పొలాన్ని ల్యాండ్ సీలింగ్ కింద నూర్జహాన్‌కు ఇచ్చినట్లు తెలిపారు. 310/1బిలో వారసత్వంగా తమకు సంక్రమించిన 2.10 ఎకరాల్లో 1.70 ఎకరాల భూమి వస్తుందని నూర్జహాన్ ఆమె కుమారులు, కోడలు తన పొలాన్ని విత్తనం వేయకుండా పలుమార్లు అడ్డుకున్నారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. ఘర్షణలకు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై భవిష్యత్తులో రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. బాధితులి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మైనార్టీ కాలనీ సమస్యలు పరిష్కరించాలి : ఆవాజ్

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని మైనార్టీ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆవాజ్ నాయకులు ఇక్బాల్, నాయకులు హుస్సేన్, అజీమ్ ఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాలనీ ఏర్పడి 20 ఏళ్లయినా ఇంతవరకు మెయిన్ రోడ్డు లేదన్నారు. కాలనీలో లింకు రోడ్లు లేవన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు గతంలో వినతులు అందించినా ప్రయోజనం లేదని తెలిపారు. కమిషనర్ స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యం

- ప్రిన్సిపల్ సంజన్న

ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ఆదోని

డ్రగ్స్ రహిత దేశంగా మార్చడమే నషా ముక్త భారత్ అభియాన్ లక్ష్యమని ప్రిన్సిపల్ వి.సంజన్న తెలిపారు. సోమవారం ఆదోనిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులు ఎం.గోవిందరాజులు విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. డ్రగ్స్ ఆరోగ్యం, జీవితాన్ని ఎలా దెబ్బతీస్తుందో వివరించారు. డ్రగ్స్‌లో చిక్కుకునే అవకాశమున్న పరిస్థితుల్లో యువకులను, ప్రజలను రక్షించడంపై ప్రభుత్వం దృష్టి పెడుతోందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రభుత్వం నిబద్ధతకు నషా ముక్త్ భారత్ అభియాన్ నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. జంతుశాస్త్ర అధ్యాపకులు వేదవతి, వ్యాయామ అధ్యాపకులు చిట్టి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

మోటార్ సైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండలంలోని కుందనగుర్తి గ్రామానికి చెందిన కురువ గాదిలింగప్ప, ములగిరి పెద్దన్నలు కుందనగుర్తి నుంచి చిప్పగిరికి బ్యాంకు పని మీద సోమవారం మోటార్ సైకిల్‌పై బయల్దేరారు. ఆలూరు నుంచి వేగంగా వస్తున్న కారు కుందనగుర్తి బస్టాండ్ సమీపంలో ఢీకొట్టింది. గాదిలింగప్ప, పెద్దన్నలు గాయపడడంతో చిప్పగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టిన కారును పట్టుకొని కఠినంగా శిక్షించి తీవ్రంగా గాయపడిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

నిందితులను అరెస్టు చేయాలి

- దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

పీర్ల పండగ సందర్భంగా మండలంలోని ముద్దటమాగి గ్రామంలో మాదిగలపై దాడి చేసిన ఘటనలో నిందితులను అరెస్టు చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రసాదరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిందితులపై కేసు నమోదయి డీఎస్పీ విచారణ ముగిసినప్పటికీ నిందితులను అరెస్టు చేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో దళితులపై దాడులు చేయడం, వ్యవస్థలను ఉపయోగించుకుని రాజీల కోసం ప్రయత్నం చేయడం, కౌంటర్ కేసులు బనాయించడం సాధారణమైపోయిందని విమర్శించారు. గ్రామంలో దళితులను కూలి పనులకు పిలవద్దని, ఎలాంటి లావాదేవీలూ చేయవద్దని మాట్లాడుకుంటూ సామాజికంగా బహిష్కరించేలా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. నిందితులను అరెస్టు చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దళిత సంఘాల నాయకులు చిదానంద, ఎంపిటిసిలు మల్లికార్జున, కెంచప్ప, ఎంఆర్‌పిఎస్ నాయకులు వెంకటేష్ మాదిగ, వీరేష్ మాదిగ, పకీరప్ప మాదిగ, దళిత సమాఖ్య నాయకులు నల్ల మల్లేష్, డివైఎస్ నాయకులు కన్నారావు, సినిమా మంగన్న, నాగరకన్వీ వెంకటేష్ పాల్గొన్నారు.

14 నుంచి దశమి ఉత్సవాలు

- అన్ని ఏర్పాట్లూ పూర్తి
- ఆలయ కమిటీ ఛైర్మన్ పార్వతి

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని తంగరడోన గ్రామంలో వెలిసిన శ్రీచింతల ముని, నల్లా రెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ పార్వతి, సర్పంచి శంకరమ్మ, ఎంపిటిసి నరసన్న, గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, వెంకన్న, మాజీ ఎంపిటిసి జయలక్ష్మి తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. ప్రతేడాది శ్రావణమాసంలో శ్రీచింతల ముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దశమి సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని చెప్పారు. 14న బుధవారం శ్రీచింతల ముని, నల్లా రెడ్డి స్వాముల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురశిష్యులైన శ్రీచింతల ముని, నల్లా రెడ్డి స్వాములను ప్రత్యేక పూలమాలలతో అలంకరించి, రాత్రి ఆలయ కమిటీ ఛైర్మన్ పార్వతి ఇంటి నుంచి స్వామివారి ఆభరణాలను మేళతాళాలు, భాజభజంత్రీలతో ఆలయానికి తీసుకొచ్చి చింతలముని అశ్వాన్ని ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరిస్తారని చెప్పారు. 15న గురువారం తెల్లవారుజామున కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకు పూజ వంటి ప్రత్యేక పూజలు ఆలయ పురోహితులు నిర్వహిస్తారని తెలిపారు. శ్రీచింతల ముని ఆలయం నుంచి స్వామివారి అశ్వ వాహనాన్ని, పల్లకిని గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తూ నల్లారెడ్డి స్వామి వారి ఆలయానికి చేరుకొని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం ఊరేగింపులో స్వామివారి అశ్వానికి భక్తులు పండ్లు, మిఠాయిలు తినిపిస్తారని తెలిపారు. 16న శుక్రవారం శ్రీచింతల ముని, నల్లా రెడ్డి స్వాముల ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే దశమి ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా అన్నదానం, నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఆస్పరి సిఐ మస్తాన్ వలీ బందోబస్తు ఏర్పాటు చేస్తారని తెలిపారు.

స్వాముల వారి ఆలయం

పార్వతి

పెండింగ్ వేతనాలివ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని గ్రామాల్లో 11 వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యకాస నాయకులు కోరారు. మండలంలో అందరికీ పనులు కల్పించాలని వ్యకాస ఆధ్వర్యంలో ఎపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. గత జూన్ నెల నుంచి పనులు చేసిన కూలీలకు వేతనాలు అందలేదని, ఉపాధి హామీ కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా సరైన వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఇలాంటి సమయంలో గ్రామాల్లో పనులు కల్పించకుండా, పనులు నిలిపివేయడం సరికాదని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందజేయాలని కోరారు. వేతనాలు కూలీల ఖాతాలో జమ అవుతున్నాయని, పనులు అందరికీ కల్పిస్తామని ఎపిఒ హామీ ఇచ్చారు. రైతుసంఘం మండల నాయకులు హనుమంతు రెడ్డి, ఉపాధి మేటీలు అనంత, హుస్సేని, హనుమంతు రెడ్డి, ఉపాధి కూలీలు గోవిందు రెడ్డి, హుస్సేని, ఆంజనేయ, నాగయ్య, నర్సిరెడ్డి, చిన్నన్న, బడే సాబ్ పాల్గొన్నారు.

లింగాకర్షణ బుట్టలతో గులాబీ పురుగు నివారణ : ఎడిఎ

ప్రజాశక్తి - దేవనకొండ

లింగాకర్షణ బుట్టలతో రైతులు పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారించుకోవచ్చని పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ కుమార్, దేవనకొండ ఎఒ సురేష్ బాబు తెలిపారు. సోమవారం మండలంలోని కరివేముల, దేవనకొండ శివారులో పత్తి, వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలను ఎకరాకు 5 నుంచి 6 వరకు అక్కడక్కడ పెట్టుకోవాలన్నారు. ఈ లింగాకర్ష బుట్టలు పెట్టడం వల్ల గులాబీ రంగు పురుగును కొంతవరకు అదుపు చేయవచ్చని తెలిపారు. 70 రోజుల పంటకు క్లోరోపైరీఫాస్ 2.5 లీటర్లు, 80 రోజుల పంటకు క్వినాల్ పాస్ 1.5 మిల్లీలీటర్లు లీటరు నీటిలో, 100 రోజుల పంటకు క్లోరంత్రినిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు. వరి పంట నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు కాలిబాటలు తీయడం వల్ల పైరుకు గాలి వెలుతురు బాగా తగిలి చీడపీడల ఉధృతిని కొంతవరకు అదుపు చేసుకోవచ్చన్నారు. ఎఇఒలు రంగన్న, యోగేంద్ర, జయరామ్, విహెచ్ఎ రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని వన్‌టౌన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా హమాలీలు సహకరించాలని సిఐ శ్రీరామ్ కోరారు. సోమవారం ఆదోని 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫుడ్ గ్రేన్స్ హమాలీ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సిఐటియు సీనియర్ నాయకులు భీమానందరెడ్డి, తిప్పన్న, లక్ష్మన్న, హమాలీ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేష్, శ్రీనివాసులు సమక్షంలో సిఐ శ్రీరామ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. హమాలీ కార్మికులు ఐకమత్యంగా ఉండి పనులు చేసుకోవాలని సూచించారు. హమాలీ నాయకులు ఈరప్ప, శివ, నీలకంఠ, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

సిఐని కలిసిన సిఐటియు నాయకులు

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఆలూరు

సార్వత్రిక ఎన్నికల తర్వాత బదిలీల్లో భాగంగా తహశీల్దార్‌గా గోవిందు సింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, ఎన్నికల డిటి గుండాల్ నాయక్, ఆర్ఐ బసవన్న గౌడ్ కార్యాలయ సిబ్బంది కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాయచోటిలో విధులు నిర్వహించి బదిలీల్లో భాగంగా ఆలూరుకు వచ్చినట్లు తెలిపారు. ఆరోగ్యరీత్యా ఆలస్యమయిందని చెప్పారు. సమిష్టిగా పని చేస్తూ ప్రజా, రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని తెలిపారు.

సచివాలయంలో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీలో ఉన్న సచివాలయాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, ఇతర రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందించే సేవలను ఎస్‌ఎల్‌ఎ ప్రకారం సక్రమంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలించారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలి

- ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వర రావు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయమూ లేకుండా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం గోనెగండ్లలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఆయన పరిశీలించారు. ఎస్ఎస్ ట్యాంకు నీటి నిల్వ, పంపింగ్ చేసే విధానం, క్లోరినేషన్ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సాంబయ్య, ఎఇ శ్రీనివాసరెడ్డి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, అక్బర్ పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు : తహశీల్దార్ రవి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ సదస్సులను మండలంలోని గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎస్.రవి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 18 వరకు మొత్తం 22 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్ణయించిన తేదీల్లో ఉదయం 10 నుంచి 3 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల రెవెన్యూ అధికారులు గ్రామాల్లోని సచివాలయాల్లో ఏ రోజు రెవెన్యూ సదస్సు జరుగుతుందో తేదీని నోటీసులు అంటించాలని తెలిపారు. దండోరా వేసి ప్రజలకు సమాచారం అందించాలని ఆదేశించారు. భూ సంబంధిత సమస్యలపై ఏర్పాటు చేయనున్న సదస్సులను ఉపయోగించుకోవాలని కోరారు.

పుకార్లు నమ్మవద్దు : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలు బైపాస్ రోడ్డు (హెచ్‌కెజిఎన్ సర్కిల్) పేరును మారుస్తున్నట్లు వస్తున్న పుకార్లను నమ్మవద్దని టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హుస్సేన్ సాబ్, తురెగల్ నజీర్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డు సర్కిల్ సర్కిల్ పేరును మారుస్తున్నట్లు ఇటీవల కాలంలో పట్టణంలో కొంత మంది వైసిపి నాయకులు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. పట్టణంలోని ముస్లిం, మైనార్టీలను తప్పుదోవ పట్టించడానికి మసీదుల్లో తీర్మానాలు చేస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. కర్నూలు బైపాస్ రోడ్డు సర్కిల్ (హజరత్ ఖాజా గరీబ్ నవాజ్) సర్కిల్‌గానే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎమ్మిగనూరులో మైనార్టీలకు అండగా ఉండేది ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి కుటుంబమేనని తెలిపారు. షాబీర్, దాదా, అబ్దుల్ సలాం, ఇస్సాక్, ముల్లా కలీముల్లా, జహంగీర్, బందే నవాజ్, సలీం, అల్తాఫ్, మున్నా, ఫరీద్, మోసిన్, సిఎమ్‌డి.అల్తాఫ్, అబ్దుల్లా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హుస్సేన్ సాబ్